## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశు ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

• -కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 11: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండలంలోని కోమల్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను కలెక్టర్ వ సంగళవారం ఆకస్మికంగా సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవలు అందించే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో అపరిశు భ్రత కనిపించకుండా చూడాలని, నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి శివరాత్రి యాకుబ్ ను ఆదేశించారు. అంతకు ముందు ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల నిల్వలు, రోగులకు పంపిణీ చేసిన మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు, కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవైద్యాధికారి ఇంజామమ్ ఆలీ, సర్పంచ్ వల్లాల అశోక్, ఉప సర్పంచ్ నల్ల అశోక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు



# ఆర్.సి.ఒ.ఏ క్లబ్‌లో ఆకట్టుకున్న 'సత్యశోధక' నాటిక





జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి -- జీఎం డి. లలిత్ కుమార్

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఏరియా--1లోని ఆర్.సి.ఒ.ఏ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, ఆశయాల ఆధారంగా రూపొందించిన 'సత్యశోధక' నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.జి.1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జీఎం డి. లలిత్ కుమార్ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాటికను వీక్షించారు. సమాజంలో విద్య, సమానత్వం, మహిళా సాధికారత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని, వారి ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జీఎం పేర్కొన్నారు.

'సత్యశోధక' నాటికలో పూలే దంపతులు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, వివక్షకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, మహిళలకు విద్య అందించేందుకు చేసిన కృషిని కళాకారులు తమ అద్భుతమైన నటన ద్వారా ప్రదర్శించారు. నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమానికి సింగరేణి పాఠశాలల విద్యార్థులు, సింగరేణి ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై నాటికను ఆసక్తిగా తిలకించారు.

కార్యక్రమంలో, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఏఐటీయూసీ ప్రతినిధి ఇజ్జగిరి రాజు, అధికారుల సంఘం ప్రతినిధి పేరుమాల్ల శ్రీనివాస్, బీసీ సంఘం లైజన్ ఆఫీసర్, సెంట్రల్ ప్రెసిడెంట్ దీటి చంద్రమౌళి, జనరల్ సెక్రటరీ దేవాచారి, ఉపాధ్యక్షులు కోలా మల్లేష్, ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పులి మోహన్, జనగామ నర్సయ్య, లింగమూర్తి, అధికారులు, అనిల్ గబాలే, వేణు, శ్రవణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



## హెచ్‌పీవీ టీకాతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

• కేజీబీవీలో పద్నాలుగు మంది బాలికలకు టీకాలు.. తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని వైద్యుల సూచన..





హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ఆగస్టు 11/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం పద్నాలుగు నుంచి పదిహేనేళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్నాలుగు మంది బాలికలకు టీకాలు వేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ టీకా కీలకపాత్ర పోషిస్తుందని డా. రుబీనా, డా. రహమాన్ తెలిపారు. వారు మాట్లాడుతూబాలికల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం అర్హులైన వయస్సులో టీకా వేయించాలని సూచించారు. తల్లిదండ్రులు హెచ్‌పీవీ టీకాపై అవగాహన పెంచుకుని అర్హులైన బాలికలకు తప్పనిసరిగా టీకా వేయించాలని కోరారు. తీవ్రమైన వ్యాధులను ముందస్తు నియంత్రించేందుకు టీకాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, నర్సింగ్ కవిత, శౌర్య, సూపర్‌వైజర్ మోహన్, ఏఎన్ఎంలు లక్ష్మి, స్వరూప, కోమల, ఆశా కార్యకర్త, పాల్గొన్నారు.

## ఉరిసుకొని యువకుడు ఆత్మహత్య



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -11(అక్షరం న్యూస్

ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామానికి చెందిన శ్రీశైలం (25)అనే యువకుడు మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తండ్రి మల్లేశం పిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

# గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఈశ్వర్ మృతి



భద్రాద్రి కొత్తగూడెం/జూలూరుపాడు/ఆగస్టు11/అక్షరం న్యూస్: మండల పరిధిలోని పడమట నర్సాపురం రామాలయం వద్ద సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాదావత్ ఈశ్వర్ ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. వివరాలు... సోమవారం రాత్రి ప్రమాదానికి గురైన ఈశ్వర్ ను స్థానికుల సహాయంతో చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం ఈశ్వర్ కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో కొత్తగూడెంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మరణించాడు. చిన్న వయసులోని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల స్నేహితుల నుంచి దూరమవడంతో వారందరూ శోకసముద్రంలో ఉండిపోయారు.విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## మోహన్ లాల్ కుమార్తె విస్మయ.. తుడక్కం మూవీతో అరంగేట్రం



మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ.2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ.6.63 కోట్లు) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం.

# టాక్సిక్ రన్‌టైమ్ పై ఆసక్తికర ప్రచారం




ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో 'టాక్సిక్ ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం. ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. కన్నడ ఇండస్టీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది .

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609